## న్యూస్‌రీల్

### యువజన కళా ఉత్సవ్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంఈవో రాధాకృష్ణమూర్తి

చెన్నూర్: హైదరాబాద్ పట్టణంలోని నాంపల్లి సమీపంలో గల నందమూరి రామారావు కళామందిర్‌లో ఈ నెల 22న శ్రీ కళావేదిక యువజన విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే యువజన కళా ఉత్సవ్ పోస్టర్‌ను ఎంఈవో కొమ్మెర రాధాకృష్ణమూర్తి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీ కళావేదిక యువజన విభాగం వారు యువకళాకారులు, రచయితలు, డ్యాన్సర్లను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న యువజన కళా ఉత్సవ్‌ను యువ కళాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీ కళావేదిక తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మామిడి అక్షిత, రచయితలు దబ్బెట రాయమల్లు, బొడ్డు మహేందర్, లక్ష్మీనారాయణ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

### బీజేపీలో చేరిక

దండేపల్లి: మండలంలోని కన్నెపల్లి ఉపసర్పంచ్ దుమ్మని సత్తయ్య శనివారం బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన ఆయనకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

### శివాజీ మహరాజ్ విగ్రహం ఏర్పాటు చేయాలి


మంచిర్యాలటౌన్: పట్టణంలోని లక్ష్మీ థియేటర్ చౌరస్తాలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఛత్రపతి విగ్రహ సాధన సమితి సభ్యులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో సాధన సమితి సభ్యులు ఏర్పాటు చేసిన సమావేశంలో రాము మాట్లాడుతూ గత 10నెలల నుంచి విగ్రహ స్థలం కోసం అనేక సార్లు అధికారులకు మెమోరాండం ఇచ్చినా, ఇప్పటి వరకు స్థలాన్ని కేటాయించలేదన్నారు. శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపన కోసం అన్ని ఏర్పాట్లు చేసుకున్నట్లు తెలిపారు. ఈ నెలాఖరులోగా స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు.

### టీయూసీసీ జిల్లా ఉపాధ్యక్షుడిగా మోహన్



రామకృష్ణాపూర్: ఏఐఎఫ్‌బీ అనుబంధ ట్రేడ్ యూనియన్ కో–ఆర్డినేషన్ సెంటర్(టీయూసీసీ) జిల్లా ఉపాధ్యక్షుడిగా రామకృష్ణాపూర్‌కు చెందిన న్యాయవాది చంద్రగిరి చంద్రమోహన్‌ను నియమించారు. ఈ మేరకు శనివారం ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా అధ్యక్షుడు ముల్కల కనకయ్య నియామకపు ఉత్తర్వులు అందించారు. కార్మిక వర్గ సమస్యలపై నిరంతరం పోరాటం సాగిస్తామని నాయకులు తెలిపారు.

## సాక్షి సినిమాలు




**మంచిర్యాల**
శ్రీనివాస : వాల్తేరు వీరయ్య
వెంకటేశ్వర : వీరసింహారెడ్డి
జెమిని సినిమా స్క్రీన్ 1 : వాల్తేరు వీరయ్య/తెగింపు
జెమిని సినిమా స్క్రీన్ 2 : వీరసింహారెడ్డి/వారసుడు/కళ్యాణం కమనీయం

**లక్సెట్టిపేట**
మహానంద: వాల్తేరు వీరయ్య/వీరసింహారెడ్డి

**జన్నారం**
రాఘవేంద్ర: వాల్తేరు వీరయ్య/వీర సింహారెడ్డి

**చెన్నూర్**
శ్రీశ్రీనివాస: వాల్తేరు వీరయ్య/వీర సింహారెడ్డి

**బెల్లంపల్లి**
రామకృష్ణ : వాల్తేరు వీరయ్య
బాలాజీ : వీరసింహారెడ్డి/వారసుడు

**సీసీసీ**
దేవి : వాల్తేరు వీరయ్య
తిరుమల : వీరసింహారెడ్డి

- మంచిర్యాలటౌన్

# కల్యాణం.. కమనీయం



భీమారంలో కల్యాణం జరిపిస్తున్న పురోహితులు

- అంగరంగ వైభవంగా గోదారంగనాథుల కల్యాణం
- ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు
- ఆలయాల్లో కిక్కిరిసిన భక్తులు

భీమారం: మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామాలయంలో గోదాదేవీరంగనాథస్వామి కల్యాణ మహోత్సవం అంగరంగవైభవంగా నిర్వహించారు. అర్చకులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి మేళతాళాల మధ్య ఆలయ ఆవరణలో గోదాదేవీ, రంగనాయకుల విగ్రహాలను ఉంచి కల్యాణం జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించారు. తీర్థప్రసాదాలు అందించి అనంతరం భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో అర్చకులు ప్రవీణ్‌కుమార్, విశ్వేశ్వరశర్మ, ఆలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ సరోజన, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జైపూర్: మండలకేంద్రంలో గల భూనీల సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో పండితులు కృష్ణమాచార్యుల నేతృత్వంలో గోదాదేవి–రంగనాయకుల కల్యాణం నిర్వహించారు. ప్రజలకు శాంతిసౌభాగ్యం కలగాలని, ప్రజల్లో సుఖశాంతులు నెలకొనాలని, సంవృద్ధిగా పంటలు పండాలని ప్రత్యేక పూజలు చేశారు. ఇందారం శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో, షెట్‌పల్లిలో కోదండ రామాలయంలో గోదాదేవి–రంగనాయకుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మంచిర్యాలఅర్బన్: స్థానిక తిరుమలగిరి కాలనీ శ్రీ వెంకటేశ్వరస్వామి శ్రీదేవి భూదేవి సహిత ఆలయంలో, గౌతమినగర్ కోదండ రామాలయం రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో గోదాదేవి రంగనాథస్వామి కల్యాణ మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ కౌన్సిలర్ సుదమల్ల హరికృష్ణ దంపతులు, ఆలయ కమిటీ అధ్యక్షుడు అశోక్, సభ్యులు విజయ్‌బాబురావు, ఆకుల రాజన్న, చిత్తారి తిరుపతి, కరుణాకర్, చిరంజీవి, శేఖర్, ఆలయ కమిటీ చైర్మన్ సిరిపురం రాజేష్, సభ్యులు నరేంద్రరావు, చంద్రయ్య, గోపాల్‌రావు, ప్రకాశ్, రామారావు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.





బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధి సుభాష్‌నగర్ బస్తీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం గోదారంగనాయకుల స్వామి కల్యాణవేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. కల్యాణ వేడుకలను తిలకించడానికి భక్తులు పెద్దసంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆసం ఏడుకొండలు, తిరుమల తిరుపతి దేవస్థానం హిందూధర్మ ప్రచార పరిషత్ వైస్ చైర్మన్ ఆర్.గంగారాం, మోరా మోక్షానందం, దేవాలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా శనివారం గోదారంగనాథుల కల్యాణం కమనీయంగా జరిగింది. హాజీపూర్ మండలంలోని గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ ఎదుట గల గోవింద క్షేత్రంలో భోగి పండగ సందర్భంగా అశేష భక్తజనావాహిని మధ్య గోదారంగనాథుల కల్యాణ మహోత్సవం కనుల పండవగా వైభవోపేతంగా జరిపారు. బెటాలియన్ అదనపు కమాండెంట్ ఎం.ఐ.సురేశ్‌లు కల్యాణం సందర్భంగా పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు.





నస్పూర్: పట్టణంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీ గోదారంగనాథుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణ మహోత్సవాన్ని వీక్షించారు. డీసీసీ అధ్యక్షురాలు సురేఖ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీకి రూ.30వేలు విరాళంగా అందించారు. అనంతరం ఆమె ఓమాక్స్ కాలనీలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పాల్గొని మహిళలు వేసిన ముగ్గులను తిలకించారు. కౌన్సిలర్లు సుమతి, సంధ్యారాణి పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డుకు నిప్పు

- దట్టమైన పొగతో స్థానికుల ఇబ్బందులు



మంటలు ఆర్పుతున్న దృశ్యం

రామకృష్ణాపూర్: స్థానిక ఆర్‌కే1 గని సమీపంలోని పాత టింబర్‌యార్డు వద్ద గల డంపింగ్ యార్డుకు గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి నిప్పుపెట్టడంతో భారీగా మంటలు చెలరేగాయి. దట్టమైన పొగ కమ్ముకోవడంతో సమీపంలోని కనకదుర్గా కాలనీ, తిలక్‌నగర్, ఏజోన్ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. విషయం తెలుసుకున్న 2వ వార్డు కౌన్సిలర్ పుల్లూరి సుధాకర్ వాటర్ ట్యాంకర్లను తెప్పించి మంటలు ఆర్పించారు. కాగా ఇటీవల తరచూ డంపింగ్ యార్డులో మంటలు చెలరేగి సమీప ప్రాంత వాసులు పొగ కారణంగా ఇబ్బందులు పడుతున్నా, సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలంలోని మాలగురిజాల గ్రామ పంచాయితీ పరిధి రంగపేట గ్రామానికి చెందిన నాగుల నారాయణ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల పక్షవాతానికి గురై మంచానికే పరిమితమయ్యాడు. నారాయణది నిరుపేద కుటుంబం కావడంతో ఆయన దీనస్థితిని గమనించిన బెల్లంపల్లికి చెందిన జై భీమ్ గ్రూప్స్ అండ్ స్మార్ట్ టీమ్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో రూ.15వేలు, వేల్పుల నరేష్ రూ.5వేలు మొత్తం రూ.20వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు నారయణ కూతుళ్ల చదువుకోవడానికి పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జై భీమ్ గ్రూప్స్ అండ్ స్మార్ట్ టీమ్ సభ్యులు మాదరి రాకేష్, జూపాక చంద్రశేఖర్, బోగే అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహకం

మందమర్రిరూరల్: సింగరేణి ఉద్యోగుల పిల్లల్లోని మెరిట్ విద్యార్థులకు యాజమాన్యం తరుపున అందించే రూ.10వేలు ప్రోత్సాహక చెక్కులను శనివారం ఏరియా జీఎం ఆఫీస్‌లో జీఎం శ్రీనివాస్ అందజేశారు. కేకే–ఓసీలో ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న నూనె సాంబయ్య కూతురు ప్రభుత్వ మెడికల్ కాలేజ్ (సిద్దిపేట)లో రెండో సంవత్సరం చదువుతున్న పావని, ఏరియాలో వర్క్‌షాపులతో జనరల్ మజ్దూర్‌గా విధులు నిర్వర్తిస్తున్న బొడ్డు కుమార్ కుమార్తె ఉస్మానియా మెడికల్ కాలేజీలో రెండో సంవత్సరం చదువుతున్న వైష్ణవిలకు చెక్కులు అందించారు. భవిష్యత్‌లో ఉన్నత చదువులు చదవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధికారులు, యూనియన్ల ప్రతినిధులు ఉన్నారు.





భీమారంలో భోగిమంటల వద్ద యువతులు



దండేపల్లి: మాదాపూర్‌లో భోగివేడుకల్లో యువతులు



కన్నెపల్లిలో చిన్నారికి రేగిపండ్ల స్నానం

## ఘనంగా భోగి వేడుకలు

భీమారం/దండేపల్లి/మందమర్రిరూరల్/భీమిని/బెల్లంపల్లి/మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా వ్యాప్తంగా భోగి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. చిన్నా, పెద్ద అందరూ పాల్గొని తెల్లవారుజామునే కర్రలతో, పాత సామగ్రితో భోగిమంటలు ఏర్పాటు చేసి, చుట్టూ చేరి నృత్యం చేశారు. ఆడపడుచులు ఇళ్ల ఎదుట కళ్లాపి చల్లి, ముగ్గులు వేసి రంగు రంగులతో అందంగా తీర్చిదిద్దారు. ముగ్గు మధ్యలో పేడతో గొబ్బెమ్మను చేసి, నవధాన్యాలు, చిక్కుడు కాయలు, రేగుపండ్లు, గడ్డిపోచలతో అలంకరించారు. చిన్నారులకు రేగిపండ్ల స్నానం(భోగి స్నానాలు) తాతయ్యలు, అమ్మమ్మలు చేయించి, అక్షింతలు వేసి దీవించారు. పిండివంటలతో వాడవాడలు ఘుమఘుమలాడాయి. పతంగులు ఎగరవేస్తూ చిన్నారులు సందడి చేశారు. గుడిపేటలో అదనపు కమాండెంట్ ఎం.ఐ.సురేశ్ ఆధ్వర్యంలో భోగి మంటలు వేయగా అసిస్టెంట్ కమాండెంట్ రఘునాథ్‌చౌహాన్, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్సైలు, బెటాలియన్ సిబ్బంది పాల్గొని భోగి మంటలు కాగారు. పండుగను పురస్కరించుకుని ప్రజలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలిపి ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు.



గుడిపేట పోలీస్ బెటాలియన్‌లో భోగి మంటల వేడుకల్లో అధికారులు, సిబ్బంది



బెల్లంపల్లి: ఇంటి ఎదుట ముగ్గువేసి రంగులు అద్దుతున్న మహిళలు



మందమర్రిరూరల్: శ్రీశ్రీశ్రీ మహంకాళి అమ్మవారి ఆలయం వద్ద భోగి మంటలు

# ఉత్సాహంగా సాగిన కబడ్డీ పోటీలు



ఫైనల్‌లో తలపడుతున్న జట్లు

రామకృష్ణాపూర్: పట్టణంలోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో జీఎస్‌ఆర్ ఫౌండేషన్ సహకారంతో హనుమాన్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కబడ్డీ పోటీలు ఉత్సాహంగా సాగాయి. జూనియర్స్, సబ్ జూనియర్స్ విభాగాల్లో మొత్తం 15జట్లు పాల్గొన్నాయి. సంక్రాంతి సెలవులు కావడంతో పోటీలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో జనం విచ్చేయడంతో పండగ వాతావరణం కనిపించింది. విజేతలకు శనివారం సాయంత్రం బహుమతులు అందించారు. జీఎస్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ రాజరమేష్, క్లబ్ నిర్వాహకులు శ్రీనివాస్, ఆయా పార్టీల నాయకులు గాండ్ల సమ్మయ్య, గోపతిరాజయ్య, రఘునాథ్‌రెడ్డి, మహంకాళి శ్రీనివాస్, పొన్నాల సాగర్, బద్రి సతీష్, సురేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### క్రీడాకారులకు నగదు అందజేత

దండేపల్లి: మండలంలోని కన్నెపల్లిలో కబడ్డీ క్రీడాకారులకు, కబడ్డీ మ్యాట్, షూ కొనుగోలుకు సర్పంచ్ రజనీ రూ.5వేల నగదును శనివారం అందించారు. కార్యక్రమంలో స్థానికులు, కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు.

# వాలీబాల్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

దండేపల్లి: క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ఆడాలని బీజేపీ జిల్లాఅధ్యక్షుడు రఘునాథ్ అన్నారు. దండేపల్లి మండలం మాదాపూర్‌లో యువజనోత్సవాల్లో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలుపే లక్ష్యంగా క్రీడాకారులు ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాజయ్య, నిర్వాహకులు వంశీకృష్ణ, పార్టీ నాయకులు శ్రీనివాస్, ప్రభాకర్, రవిగౌడ్, హరికృష్ణ, శ్రీనివాస్, వెంకటేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# ‘బాల్క’ క్రికెట్ ప్రీమియర్ లీగ్



ఉత్తమ ప్రతిభ కనబర్చిన సతీశ్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అందజేస్తున్న నిర్వహకులు

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో బాల్క ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన రుద్ర ఏలెవన్, అరుణ్ ఏలెవన్ క్రీడాకారులు సతీశ్, అరుణ్‌లు ఆల్ రౌండర్ ప్రతిభ కనబర్చారు. వీరిద్దరికి నిర్వహకులు 16వార్డు కౌన్సిలర్ తుమ్మ రమేశ్ షీల్డ్‌లను అందజేశారు. పోటీలు ఈ నెల 17వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నాయిని సతీశ్, మేడ సురేశ్‌రెడ్డి, వెంకటరాజం, నారాయణ పాల్గొన్నారు.

# కార్మిక సమస్యలపై ఏఐటీయూసీ ఆందోళన



గని మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సింగరేణి కార్మికుల సమస్యలపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గనుల డిపార్ట్‌మెంట్‌లపై శనివారం ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం అధికారులకు సమస్యలతో కూడిన వినతిపత్రాలు అందించారు. కేకే–1 గని మేనేజర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందించిన ఏఐటీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు సుదర్శన్ మాట్లాడుతూ.. మందమర్రి ఏరియాలో కార్మికులు తక్కువగా ఉండి క్వార్టర్లు ఎక్కువగా ఉన్నా, కొంత మందికి సౌకర్యాలు ఉన్న క్వార్టర్లు యాజమాన్యం కేటాయించలేక పోతుందని ఆరోపించారు. అధికార పార్టీ నాయకులు సౌకర్యాలు ఉన్నటువంటి క్వార్టర్లను కబ్జా చేసి దర్జాగా ఉంటున్నారని మండిపడ్డారు. సింగరేణి క్వార్టర్స్‌లలో నుంచి కార్మికేతరులను ఖాళీ చేయించాలని డిమాండ్ చేశారు. సీఎంపీఎఫ్ చిట్టీలు వెంటనే పంపిణీ చేయాలని, పాత పద్ధతిలోనే లీవులు, ప్లేడేలు అమలు చేయాలని, నాణ్యమైన పరికరాలు అందించాలని, స్పెర్టర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, రాజేషం, తిరుపతి, ప్రభాకర్, సీహెచ్ పీ శర్మ, కుమార్, మనోహర్ తదితరులు ఉన్నారు.

## జేసీబీతో కడెం కాలువ పూడిక తీత

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల పరిధిలోని కడెం 42డిస్ట్రిబ్యూటరీ కాలువల్లోని పూడిక తీత పనులను శనివారం మండల రైతుబంధు సమితి కన్వీనర్ పూస్కూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చేయించారు. వేసవి కాలం సమీపిస్తుండటంతో రైతుల పంట పొలాలకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో కడెం కాలువల్లో పేరుకుపోయిన పిచ్చిచెట్లను, పూడికలను జేసీబీతో చదును చేయించి సాగునీరు సక్రమంగా పొలాలకు అందేలా చర్యలు చేపట్టారు.

# వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో భోగిమంటలు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో పీఏసీఎస్ చైర్మన్, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు సందెల వెంకటేశ్ ఆధ్వర్యంలో భోగి మంటలు వేసి సంబురాలను ఘనంగా జరుపుకున్నారు. 200లకు పైగా సభ్యులు ఒకేరకంగా తెల్ల చొక్కా, పంచెలను ధరించి శనివారం ఉదయం 5గంటలకు భోగి మంటలు వేసి, పండుగను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు కారుకూరి చంద్రమౌళి, వేముల వీరస్వామి, తూండ్ల సాగర్ యాదవ్, బైరి చంద్రమౌళి, బద్రుద్దిన్, కోడూరి రమేశ్, మంతెన గట్టయ్య, జూపాక సుధీర్, కొలిపాక విగ్నేష్, బొశెట్టి శ్రీనివాస్, గొర్ల సంతోశ్, కొంకుముట్టి మహేశ్, సుధాకర్‌రెడ్డి, కమల్ పాల్గొన్నారు.



### సరుకులు పంపిణీ

కోటపల్లి: మండలంలోని మల్లంపేట గ్రామంలోని నిరుపేదలకు సంక్రాంతి పండగ సందర్భంగా టీడీపీ పెద్దపల్లి పార్లమెంట్ అధ్యక్షుడు సంజయ్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు తిరుపతి, మండల నాయకులు పాల్గొన్నారు.